

పెద్దాపూర్‌లో పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ప్రభుత్వ తోడ్పాటుతో గ్రామాల్లో ప్రగతి కాంతులు

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు వసతులు కల్పించాలన్నదే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు, వెల్దండ, కల్వకుర్తి మండలాల్లో ఆదివారం ఆయన పర్యటించారు. గ్రామాల్లో రూ.5కోట్లతో నిర్మించే, పూర్తయిన బీటీ రోడ్లు, అంగన్‌వాడీ, పంచాయతీ భవనాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో రూ. వెయ్యి కోట్లతో రోడ్లను నిర్మించి ఆధునికీకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆయా పనులకు ఇప్పటికే రూ.600కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు. పంచాయతీలు, అంగన్‌వాడీ కేంద్రాలకు ఈజీఎస్ నిధుల ద్వారా భవనాల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమి లేదన్నారు. కార్యక్రమంలో నాయకులు బాలాజీ సింగ్, సంజీవ్ కుమార్, పర్వత్ రెడ్డి, ఆనంద్ కుమార్, విజయ్‌కుమార్ రెడ్డి, కాయితీ కిశోర్ రెడ్డి, మోతిలాల్, శ్రీకాంత్ రెడ్డి, అశోక్ రెడ్డి తదితరులు ఉన్నారు.

జోరుగా గణనాథుల విక్రయాలు



షాద్‌నగర్ : వినాయక గంజిలో గణపతి విగ్రహాల అమ్మకాలు

వినాయక చవితి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో గణనాథుల విగ్రహాల విక్రయాలు జోరందుకున్నాయి. నిర్వాహకులు ఖర్చుకు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా లక్షల రూపాయలతో విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. గణపతి విగ్రహాల ప్రతిష్ఠకు పోటాపోటీగా భారీ సెట్టింగ్‌లు, లైటింగ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. విగ్రహాల ఆకృతులను బట్టి విక్రయదారులు ధరలు చెబుతున్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ వినాయక చవితికి విగ్రహాల కొనుగోళ్లు పెరిగాయని, ధరలు కూడ కాస్తా పెరిగాయని తెలిపారు.

- షాద్‌నగర్,ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి)





మంత్రి సీతక్కను సన్మానిస్తున్న మహిళలు, నాయకులు

అన్ని రంగాలలో మహిళలకు అవకాశాలు

» మంత్రి సీతక్క

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో సమాన అవకాశాలు కల్పిస్తూ వారి ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తుందని మంత్రి సీతక్క అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఆమె పేర్కొన్నారు. సీఎం వ్యక్తిగత సహాయకుడు వెల్దండ జైపాల్ రెడ్డి తండ్రి మృతిచెందడంతో పరామర్శించడానికి తిరుమలాపూర్‌కు వెళ్తూ పెద్దాపూర్ గ్రామం వద్ద ఆమె ఆగారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా నాయకుడు కాయితి కిశోర్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి సీతక్క, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డిలను సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో పెట్రోల్ పంపులు, ఆర్టీసీ అద్దె బస్సులను మహిళా సంఘాలకు కేటాయిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. అదానీ, అంబానీలకు పరిమితమైన సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఆడబిడ్డలకు అందిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మహిళలకు రూ.20 వేలు కోట్ల వడ్డీలేని రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంటే రూ.22వేల కోట్లు అందించామని చెప్పారు. కార్యక్రమంలో రమేశ్ రెడ్డి, తక్కెళ్లపల్లి శేఖర్, పర్వత్ రెడ్డి, రామస్వామి, రాజు, పాండు నాయక్, రమేశ్‌నాయక్, జయంత్ రెడ్డి, రాజు, ఎర్రయ్య, జగన్, జిలాని, రాఘవేందర్ రెడ్డి, సురేశ్, అనిల్ నాయక్ పాల్గొన్నారు.


ఘనంగా మల్లన్న బోనాలు




మొయినాబాద్ మండలంలోని కేతిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం చాకలిగూడలో ఆదివారం మల్లికార్జునస్వామి బోనాలు ఘనంగా జరిగాయి. గ్రామం నుంచి పోతురాజులు బోనాలు ఊరేగింపుగా తీసుకెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద స్వామివారి కల్యాణం నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. మొయినాబాద్, ఆగస్టు24 (ఆంధ్రజ్యోతి)

వంటతో పాటు పంట

అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయ, ఆకుకూరల సాగు



అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం నూతన పథకానికి శ్రీకారం చుట్టింది. 'పోషణ వాటిక' పథకం ద్వారా అంగన్ వాడీ కేంద్రాల్లోని ఖాళీ స్థలాల్లో కూరగాయలు, ఆకుకూరలు పండించాలని నిర్ణయించింది. ఈ పథకానికి కేంద్రం నిధులు కేటాయించనుంది. ప్రస్తుతం రంగారెడ్డిజిల్లాలో 176 కేంద్రాలు, వికారాబాద్ జిల్లాలో 90కేంద్రాల్లో కూరగాయలు, ఆకుకూరల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా అంగన్‌వాడీ కేంద్రాలకు విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. ఉద్యానశాఖ ద్వారా ఆయాలు, టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు.



- పోషణ వాటిక పథకం ద్వారా నిధుల కేటాయింపు
- విత్తనాల పంపిణీ పూర్తి.. ఉద్యానశాఖ అధికారుల పర్యవేక్షణ
- ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి రూ.10వేలు కేటాయింపు
- తొలివిడత రూ.5వేలు అందజేత

పథకానికి ఎంపికైన కేంద్రాలు	జిల్లా	అంగన్‌వాడీ కేంద్రాలు	ఎంపికైన కేంద్రాలు
	రంగారెడ్డి	1600	176
	వికారాబాద్	1129	90
	మేడ్చల్	793	00



గున్‌గల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల విత్తనాలు వేస్తున్న అధికారులు

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డిజిల్లా ప్రతినిధి)

గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లో సేంద్రియ పద్ధతుల్లో కూరగాయ, ఆకుకూరలను పెంచేందుకు చర్యలు చేపట్టింది. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధించడంతో పాటు గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పోషకాహారం అందిస్తున్న సంగతి తెలిసిందే. నగర పరిధిలో అక్షయ పాత్ర వంటి సంస్థలు రాయితీపై భోజన సదుపాయం కల్పిస్తున్నాయి. అయితే ఇది పరిమితంగానే ఉంది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఎక్కువ కేంద్రాల్లో అంగన్‌వాడీ సిబ్బంది ద్వారా పోషకాహారం అందిస్తున్నారు. అయితే ఒక్కోసారి బహిరంగ మార్కెట్‌లో అవసరానికి సరిపడా కూరగాయలు, ఆకుకూరలు దొరకడం లేదు. అలాగే ధరలు పెరగడం, నాణ్యత కొరవడడంతో క్షేత్రస్థాయిలో సమస్యలు వస్తున్నాయి. కూరగాయ ధరలు పెరిగిన సమయంలో ప్రభుత్వం కేటాయించే

మిగతా 7వ పేజీలో...



అమిత్‌షాకు అభివాదం చేస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

కేంద్ర మంత్రి అమిత్‌షాను కలిసిన స్పీకర్

వికారాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): దేశ రాజధాని న్యూఢిల్లీ అసెంబ్లీ భవనంలో రెండు రోజులపాటు జరిగే ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్‌కు తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ హాజరయ్యారు. అలాగే వివిధ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొనేందుకు వచ్చిన వివిధ రాష్ట్రాల స్పీకర్లకు ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖాగుప్తా శనివారం రాత్రి తాజ్‌మాన్‌సింగ్ హోటల్‌లో ఏర్పాటు చేసిన విందులో స్పీకర్ తన బృందంతో కలిసి పాల్గొన్నారు. ఆదివారం ఆల్ ఇండియా స్పీకర్స్ కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను స్పీకర్ ప్రసాద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాష్‌ముదిరాజ్, అసెంబ్లీ వ్యవహారాల కార్యదర్శి డాక్టర్ వి.నరసింహాచార్యులు పాల్గొన్నారు.



నరకప్రాయం..

తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు అధ్వానం

- రెండు హైవేలకు అనుసంధాన రహదారి
- రెండేళ్లుగా పడకేసిన విస్తరణ పనులు
- కంకర తేలి తరచూ ప్రమాదాలు
- పనులు పూర్తిచేయాలని మంత్రిని కలిసి వినతి

7

చెరువులో పసికందు మృతదేహం లభ్యం

మహేశ్వరం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో మానవత్వం మంట కలిసిపోతోంది. అభం శుభం తెలియని పసికందును చెరువులో వదిలేసిన సంఘటన మహేశ్వరం మండలం కోళ్లపడకల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఆరు నెలల ఆడ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలోని ఫతేసాగర్ చెరువులో వదిలేశారు. ఆదివారం చెరువులోని నీళ్లపై పసికందు మృతదేహం తేలడం గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. జీవనోపాధి కోసం వ్యవసాయ క్షేత్రాలు, ఇటుక బట్టీలు, పలురకాల పరిశ్రమల్లో పనులు చేసేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన కార్మికులు ఎవరైనా ఇలా వదిలేశారా అనే అనుమానంతో విచారణ చేపట్టారు.



కోళ్లపడకల్ ఫతేసాగర్ చెరువులో లభ్యమైన శిశువు మృతదేహం

భారత్ నుంచి బాడీబిల్డింగ్ ప్రపంచ చాంపియన్లు రావాలి

సినీ నటుడు అల్లు శిరీష్



బాడీబిల్డర్లతో సినీ నటుడు అల్లు శిరీష్

శంషాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : బాడీబిల్డింగ్‌లో భారత్ నుంచి ప్రపంచ చాంపియన్లు రావాలని సినీ నటుడు అల్లు శిరీష్ ఆకాంక్షించారు. శంషాబాద్‌లోని ఎస్ఆర్ కన్వెన్షన్‌లో జరిగిన బాడీబిల్డింగ్ పోటీలు (డెక్కన్ అప్రైజింగ్ 2025) గురువారం సాయంత్రం ముగిశాయి. ఈ కార్యక్రమంలో సినీ నటుడు అల్లు శిరీష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నా సోషల్ మీడియా పోస్టుల ద్వారా ఫిట్‌నెస్ అభిమానిగా తాను చాలామందికి తెలుసన్నారు. అన్ని ఫిట్‌నెస్ వేదికలలో తాను ఎంతో ఇష్టంగా పాల్గొంటానన్నారు. భారత్‌లో బాడీబిల్డింగ్ అనగానే స్టెరాయిడ్స్ తీసుకుంటారనే అపోహ ఉందన్నారు. శరీరాన్ని తీర్చిదిద్దుకోవడానికి స్టెరాయిడ్స్ అవసరం లేదన్నారు. సరైన ఆహారం, ట్రైనర్ మార్గదర్శకం,

మిగతా 8వ పేజీలో...

కమీషన్.. పరేషాన్



చేవెళ్లలో రేషన్ షాపు వద్ద లబ్ధిదారులు (ఫైల్)

- ఐదు నెలలుగా ఎదురుచూపులు
- రేషన్ డీలర్లకు అందని కమీషన్
- అవస్థలు పడుతున్న డీలర్లు

చేవెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి) : ఐదునెలలుగా కమీషన్‌లు అందక రేషన్ డీలర్లు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం నిర్ణయించినట్లు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల స్టాక్ కూడా సకాలంలో పంపిణీ చేశారు. ఈ మూడు నెలల తోపాటు ఏప్రిల్, మే నెలల కమీషన్ కూడా పెండింగ్‌లో ఉందని రేషన్ డీలర్లు వాపోతున్నారు. కమీషన్ డబ్బులు ప్రభుత్వం విడుదల చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చేవెళ్ల డివిజన్‌లో

మిగతా 8వ పేజీలో...

ఐదు నెలల కమీషన్ రాలేదు



ఐదు నెలలుగా కమీషన్ అందడం లేదు. దీంతో రేషన్ షాపులు నడపటం కష్టంగా మారింది. ప్రతీనెల అందాల్సినవి రాకపోవడంతో కుటుంబాలు ఎలా గడుస్తాయి. మా ఇబ్బందులను కూడా పరిగణనలోకి తీసుకొని తక్షణమే ప్రభుత్వం స్పందించాలి.

- వీరస్వామి, డీలర్ల సంఘం, చేవెళ్ల మండల అధ్యక్షుడు



వనితావెంకటేశ్‌కు కండువా కప్పుతున్న ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండాను ఎగరేద్దాం

షాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎన్నికల్లో మండలంలో బీజేపీ జెండాను ఎగరేద్దామని చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సర్దార్‌నగర్ మాజీ ఎంపీటీసీ బంగారంపల్లి అనితవెంకటేశ్ ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎంపీ, మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నంల సమక్షంలో బీజేపీలో చేరారు. నాయకులు ఆమెకు పార్టీ కండువాకప్పి ఆహ్వానించారు. అనంతరం మాట్లాడుతూ... షాబాద్ గడ్డ బీజేపీ అడ్డా కావాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీటీసీ, సర్పంచ్‌లు అన్ని స్థానాల్లో పోటీ చేసి గెలవాలన్నారు. మాజీ ఎంపీటీసీ వనిత చేరికతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అనిత మాట్లాడుతూ.. ప్రజాసేవకు అంకితమై, పూర్తిస్థాయిలో పనిచేసేందుకు బీజేపీ సరైన వేదిక అన్నారు. కార్యక్రమంలో మండల ఎన్నికల ఇన్‌చార్జి ప్రభాకర్‌రెడ్డి, మండలాధ్యక్షుడు మాణయ్య, ప్రధానకార్యదర్శి హరీశ్, రాష్ట్ర స్వచ్ఛభారత్ సెల్ కన్వీనర్ రాము పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఎమ్మెల్యే నివాళి


నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఎం.రంగారెడ్డి

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, నల్గొండ మాజీ ఎంపీ సురవరం సుధాకర్‌రెడ్డి పార్థివ దేహానికి హైదరాబాద్‌లోని సీపీఐ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, సీపీఐ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే సామాజిక రంగంలోకి అడుగేసిన సురవరం కమ్యూనిస్టు పార్టీలో క్రియాశీలకంగా పనిచేసి, అంచెలంచెలుగా ఎదిగి సీపీఐ జాతీయ కార్యదర్శిగా సేవలందించారన్నారు. బతికున్నంత వరకు సిద్ధాంతానికి కట్టుబడిన వ్యక్తి సురవరం సుధాకర్‌రెడ్డి అని కొనియాడారు.

పంచాయతీ ట్రాక్టర్‌తో వ్యవసాయ పనులు


వెంకిర్యాలలో పంచాయతీ ట్రాక్టర్‌లో తరలిస్తున్న వరినారు

కొందుర్గు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ట్రాక్టర్‌ను వ్యవసాయ పనులకు వాడుతున్నారు. కొందుర్గు మండలం వెంకిర్యాలలో ఆదివారం పంచాయతీ ట్రాక్టర్‌ను కొందరు వ్యవసాయ పనులకు వాడుకున్నారు. పంచాయతీ ట్రాక్టర్‌లో వరినారు తీసుకువెళ్లారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వెంకటయ్య స్పందిస్తూ.. చెత్త సేకరణకు వాడేందుకే ట్రాక్టర్‌కు డీజిల్ లేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సొంత పనులకు ట్రాక్టర్‌ను వాడితే చర్యలు తీసుకుంటానని తెలిపారు.

దేవుని ఎర్రవల్లిలో శ్రావణ మాస ముగింపు పూజలు


దేవుని ఎర్రవల్లిలో పల్లకి సేవ నిర్వహిస్తున్న గ్రామస్తులు

చేవెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాస ముగింపు సందర్భంగా ఆదివారం మండల పరిధి దేవునిఎర్రవల్లి హనుమాన్ ఆలయంలో పూజలు చేశారు. హనుమాన్ చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగించారు. అనంతరం గ్రామస్తులకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. అలాగే మండలంలోని తంగడ్‌పల్లిలో సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సాయిభజన, పల్లకి సేవ నిర్వహించారు. కార్యక్రమంలో సేవాసమితి సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


తంగడ్‌పల్లిలో ...

ఇవేం మరుగుదొడ్లు..

పరిగి బస్టాండ్‌లో దుర్గంధభరితంగా టాయ్‌లెట్లు

- నీటి సరఫరా లేని వాష్ రూంలు
- ప్రయాణికుల ఇబ్బందులు
- పట్టించుకోని డిపో అధికారులు



అస్తవ్యస్తంగా మరుగుదొడ్లు

పరిగి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పరిగి బస్టాండ్‌లో మరుగుదొడ్లు, మూత్రశాలలు ప్రయాణికులు ఉపయోగించుకోలేని విధంగా మారాయి. వాటివైపు వెళ్తే వచ్చే దుర్గంధాన్ని ప్రయాణికులు భరించలేకున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వాటిని వాడుకుంటున్నా ఇబ్బందులు పడుతున్నారు. ఈ బస్టాండ్‌లో డిపో అధికారులు ప్రయాణికులకు కనీస వసతులు కల్పించడంలేదు. మరుగుదొడ్లు, టాయ్‌లెట్లు సరిగా లేక ముఖ్యంగా మహిళలు అవస్థ పడుతున్నారు. సమస్యలపై కొందరు ప్రయాణికులు అడిగితే అధికారులు వింత సమాధానం ఇస్తున్నారు. బోరు చెడిపోయి నీరు రావడం లేదని, పారిశుధ్య సిబ్బంది లేరని చెబుతున్నారు. మరి అలాంటప్పుడు పే అండ్ యూస్ విధానం ఎలా అమలు చేస్తారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ప్రయాణికులు డబ్బుచెల్లించి వాడుకునే మరుగుదొడ్లలో కనీసం నీటి సదుపాయం ఉండాలి. అలాగే కమోడ్/టాయ్‌లెట్లను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలి. నల్లాల్లో నీరు రావడం లేదు. ఇవేమీ నిర్వాహకులు, అధికారులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులు స్పందించి మరుగుదొడ్లు, మూత్రశాలల నిర్వహణపై దృష్టిపెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

30న ఆలయ భూముల వేలం

కొందుర్గు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కొందుర్గులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయ భూములకు వేలం నిర్వహిస్తామని ఆలయ చైర్మన్ కృష్ణయ్య ఆదివారం తెలిపారు. ఈ నెల 30న వేలం నిర్వహిస్తామని, రూ.10వేల డిపాజిట్ కట్టి వేలంలో పాల్గొనొచ్చని తెలిపారు.

కాలుష్య కోరల నుంచి గ్రామాన్ని కాపాడండి


కంపెనీ వ్యర్థ జలాలను చూపుతున్న మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

మూడుచింతలపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయన వ్యర్థాల నుంచి తమ గ్రామాన్ని కాపాడాలని మూడుచింతలపల్లి మాజీ వైస్‌ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. జీనోమ్ వ్యాలీ పరిధి తుర్కపల్లి, కొల్తూర్ గ్రామాల్లోని పరిశ్రమల నుంచి వ్యర్థాల కాలుష్యంతో ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారని తెలిపారు. కంపెనీల వ్యర్థాలను పటేల్ కుంటలో డంప్ చేస్తున్నారని ఆరోపించారు. ఆ నీరు పెద్దచెరువులో కలుస్తోందన్నారు. రసాయన వ్యర్థాలతో ఈ ప్రాంతంలో దుర్వాసన వస్తోందని చెప్పారు. రసాయన వ్యర్థాలను రోడ్డుపై వదుతున్నారని తెలిపారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కొల్తూర్ గ్రామ ప్రజలను కాపాడాలని ఆయన కోరారు.



● పగలే వెలుగుతున్న వీధి లైట్లు

ముట్పూర్, ఉత్తరాస్‌పల్లి గ్రామాల్లో విద్యుత్ స్తంభాలకు లైట్లు పట్ట పగలు సైతం వెలుగుతున్నాయి. పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఆన్ ఆఫ్ స్విచ్‌లు లేక లైట్లు నిరంతరం వెలుగుతున్నాయి. - కొందుర్గు, ఆంధ్రజ్యోతి


చీర్యాల్‌లో వైద్య శిబిరంలో పరీక్షలు చేయించుకుంటున్న నాయకులు

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

కీసర, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని దమ్మాయిగూడ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు కందాడి శ్రవణ్‌రెడ్డి అన్నారు. ఆదివారం చీర్యాల్‌లో లైఫ్‌లైన్ తులసి ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. వైద్యుల సలహాలు,సూచనల మేరకే మందులు వాడాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అఖిల్‌రెడ్డి, మప్పు రామారావు, శ్రీకాంత్, కృష్ణయాదవ్, సురేష్, అజయ్, శివరాం, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ...

ఘట్‌కేసర్: పోచారం మున్సిపాలిటీ అన్నోజిగూడ లక్ష్మీనర్సింహ కాలనీలో నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో వైద్యశిబిరాన్ని మున్సిపల్ మాజీ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డి ప్రారంభించారు. నీలిమ ఆస్పత్రి వైద్యులు కాలనీల్లో వైద్య శిబిరాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. తరచూ వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు. శిబిరంలో 510 మందికి చికిత్సలు చేసి మందులందజేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్, రాజేశ్వర్‌రెడ్డి, నందు, సంతోష్, రాఘవేందర్‌రెడ్డి, కార్తీక్, లోకేష్‌రెడ్డి, రవీందర్, వినోద్‌రెడ్డి, శ్రీకాంత్, ప్రవీణ్, వైద్యులు పాల్గొన్నారు.


కాలనీ వాసులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

వంటతో పాటు 'పంట'

(ఐదో పేజీ తరువాయి)

నిధులు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో ఖాళీ స్థలాలు ఉన్న అంగన్‌వాడీ కేంద్రాల్లో కూరగాయ, ఆకుకూరలు పండించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం సొంతభవనాలు, ఖాళీస్థలాలు ఉన్న అంగన్‌వాడీలను గుర్తించి తొలివిడత ఇక్కడ కూరగాయ, ఆకుకూరల పెంపకాన్ని చేపడుతున్నారు. ప్రస్తుతం రంగారెడ్డిజిల్లాలో 176 కేంద్రాలు, వికారాబాద్ జిల్లాలో 90కేంద్రాల్లో ఈ కూరగాయ, ఆకుకూరల పెంపకానికి ఏర్పాట్లు చేస్తున్నారు. వీటిని పోషణ వాటికలుగా నామకరణం చేశారు. కేంద్ర ప్రభుత్వ 'పోషణ వాటిక' పథకం కింద ఇందుకు అవసరమైన నిధులు కేటాయిస్తున్నారు. ఎంపిక చేసిన ఒక్కో అంగన్‌వాడీ కేంద్రానికి ప్రభుత్వం రూ.10వేలు కేటాయిస్తోంది. అయితే తొలివిడత ఇప్పుడు రూ.5వేలు కేటాయించింది. ఈ మొత్తం డబ్బుతో ఖాళీ స్థలాలను చదును చేసి కూరగాయ, ఆకుకూరల పెంపకం కోసం స్థలాన్ని చదును చేసి సిద్ధం చేస్తారు. అలాగే విత్తనాలు, సారవంతమైన మట్టి, ఎరువు కోసం ఈ డబ్బును ఖర్చు చేయనున్నారు. వీటిని ఉద్యానశాఖ అధికారులు పర్యవేక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. అంగన్‌వాడీ కేంద్రాల్లోని ఆయాలు, టీచర్లకు తోటల పెంపకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈమేరకు సిబ్బందికి ఉద్యానశాఖ సిబ్బందితో శిక్షణ కూడా ఇస్తున్నారు. యాచారం మండలం గునగల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూరగాయల, ఆకు కూరల సాగును ప్రయోగాత్మకంగా అధికారులు చేపట్టారు. డీఆర్‌డీవో పీడీ ఇన్‌చార్జ్ జిల్లా సంక్షేమాధికారి శ్రీలత, సీడీపీవో వినీత, ఎంపీడీవో బాలశంకర్ ఇక్కడ ఇటీవల విత్తనాలు వేసి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విత్తనాల పంపిణీ పూర్తి

అంగన్‌వాడీల్లో ఆకుకూరలు, కూరగాయల పెంపకం కోసం అవసరమైన విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తయింది. జాతీయ విత్తనాభివృద్ధి సంస్థ ద్వారా విత్తనాలను అందజేస్తున్నారు. ఎంపిక చేసిన కేంద్రాలకు పాలకూర, మెంతికూర, తోటకూర, టమాట, వంగ, బెండ విత్తనాలను సరఫరా చేశారు. అన్నిచోట్ల గురువారం, శుక్రవారం విత్తనాల పంపిణీ ప్రక్రియ పూర్తి చేశారు.

మరికొన్ని సదుపాయాలు ...

అంగన్‌వాడీ కేంద్రాల్లో మరికొన్ని సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. చిన్నారులకు ఆటవస్తువులతో పాటు ఎల్‌ఈడీ స్ర్కీన్లు, సురక్షిత తాగునీటి యంత్రాలు ఏర్పాటు చేస్తోంది. ఇందుకోసం ఒక్కో కేంద్రంలో రూ.లక్ష వరకు నిధులు వ్యయం చేస్తోంది. ఎంపిక చేసిన అంగన్‌వాడీల్లో చిన్నారులకు రూ.36వేలతో ఆటవస్తువులు సమకూరుస్తోంది. అలాగే రూ.25వేలతో ఎల్‌ఈడీ స్ర్కీన్లు, రూ.16వేలతో ఇంకుడు గుంతలు నిర్మిస్తోంది. సురక్షిత తాగునీటిని అందించేందుకు ఒక్కో కేంద్రంలో రూ.10వేలతో తాగునీటి యంత్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. దశలవారీగా వీటిని చేపట్టేందుకు కార్యాచరణ రూపొందించింది.



రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

హక్కుల సాధన కోసమే బీసీ జేఏసీ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): బీసీల హక్కుల సాధన కోసమే జేఏసీని ఏర్పాటు చేశామని నాయకులు అన్నారు. ఆదివారం షాద్‌నగర్ బీసీ జేఏసీ చైర్మన్‌గా టీజీ శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ అంశంపై పెన్షనర్స్ భవనంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. జేఏసీ చైర్మన్‌గా టీజీ శ్రీనివాస్, కన్వీనర్ కె.రవీంద్రనాథ్, కో-ఆర్డినేటర్ ఎన్.నర్సింహులుగౌడ్, వైస్‌చైర్మన్లుగా బాస వరలక్ష్మి, డి. సురేష్‌కుమార్, కో-కన్వీనర్లు టి.కరుణాకర్, ఎం.వెంకటేశ్, పి.శేఖర్‌గౌడ్, బాలరాజ్‌గౌడ్‌లను ఎన్నుకున్నారు. అసెంబ్లీ తీర్మానించిన 42శాతం రిజర్వేషన్ బిల్లును పార్లమెంట్ ఆమోదించాలని నాయకులు అన్నారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పాటు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీసీ సంఘాల నాయకులు ఎం.నర్సింహులు, ఎస్.రఘునాథ్‌యాదవ్, రాఘవేందర్‌గౌడ్, వెంకటరమణ, నక్క బాల్‌రాజ్, శివకుమార్‌గౌడ్, కత్తి చంద్రశేఖర్, మేకల వెంకటేష్, శంకర్, జలజ, నరేందర్, క్యాసెట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా ఉత్సవాలను నిర్వహించుకుందాం



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో గణేష్ ఉత్సవాలను సంప్రదాయబద్ధంగా భక్తిశ్రద్ధలతో జరుపుకుందామని గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు, వీహెచ్‌పీ సేవాప్రముఖ్ బండారి రమేష్ పిలుపునిచ్చారు. ఈ నెల 27న చతుర్థి రోజున మండపాల్లో వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి నిత్య పూజలు చేయాలన్నారు. సెప్టెంబరు 7న చంద్ర గ్రహణం ఉన్నందున 6వ తేదీనే నిమజ్జనోత్సవాన్ని ముగించాలని కోరారు. పోలీసులకు విధిగా ఆన్‌లైన్‌లో మండపాల వివరాలివ్వాలని సూచించారు. మైకుల్లో భక్తి పాటలే పెట్టాలని, సామూహిక భజనలు, కోలాటాలను నిర్వహించాలని కోరారు. గ్రామీణులొచ్చి తిలకించేలా నిమజ్జనోత్సవాన్ని సాయంత్రమే ప్రారంభించాలని, ఉత్సవాల విజయవంతానికి కుల, మత, రాజకీయాలకు అతీతంగా అందరు సహకరించాలని ఈ సందర్భంగా రమేశ్ కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న దేవేందర్

జీవో ప్రకారం వేతనాలు చెల్లించాలి

చేవెళ్ల, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి):మున్సిపల్ కార్మికులకు జీవో 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్ అన్నారు. ఆదివారం చేవెళ్లలో మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న ధరల దృష్ట్యా కార్మికులకు పనికి తగిన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి సెప్టెంబరు 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించే రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. అంతకుముందు చేవెళ్ల కార్మికుల నూతన కమిటీని ఎన్నుకున్నారు. చేవెళ్ల మునిసిపాలిటీ అధ్యక్షుడిగా నరేశ్, ప్రధాన కార్యదర్శి చాకలి నరేశ్, కోశాధికారి సిద్ధమ్మ, ఉపాధ్యక్షులు దస్తగిరి, భాస్కర్, నర్సింలు, సహాయ కార్యదర్శులు జనార్ధన్, అఫ్జల్, మహేందర్, కిష్టయ్య, సభ్యులుగా మాణిక్యం, మల్లయ్య, జంగమ్మ, అడివమ్మ, శివయ్య, శ్రీనివాస్ తదితరులు ఎన్నికయ్యారు.

ప్రభుత్వాస్పత్రుల్లో 'కార్పొరేట్' వైద్యం



చెక్కు అందజేస్తున్న గూడూరు శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్, ఆగస్టు 23(ఆంధ్రజ్యోతి): పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వానికే దక్కిందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివా‌స్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కడ్తాల్‌కు చెందిన మంజులకు ఎమ్మెల్యే నారాయణరెడ్డి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2.5లక్షల ఎల్‌వోసీ మంజూరైంది. ఆదివారం మండల కేంద్రంలో గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హనుమనాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బిచ్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పీఏసీఎస్ డైరెక్టర్ వెంకటేశ్, శ్రీనివాస్‌రెడ్డిలు బాధిత కుటుంబానికి ఎల్‌వోసీ అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్, మాజీ ఎంపీటీసీ లక్ష్మయ్య, షాబుద్దీన్, మల్లేశ్‌గౌడ్, శ్రీకాంత్, దశరథ్, నరేశ్, సత్యం పాల్గొన్నారు.



పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్

కాంగ్రెస్ పాలనలో గ్రామాల అభివృద్ధి

నందిగామ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో గ్రామాలు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతున్నాయని మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్ అన్నారు. ఆదివారం చేగూర్‌లో హెచ్‌ఎండీఏ నిధులు రూ.55లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను నాయకులతో కలిసి ప్రారంభించారు. కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జంగ నర్సింలు, నాయకులు కుమార్ గౌడ్, మంకాల శ్రీశైలం, ఆవుల శివ, రాజశేఖర్, రాజు, రవితేజ, భాస్కర్, వెంకట్‌చారి, రవి, గిరి, అశోక్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యువత స్వశక్తితో ఎదగాలి

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): యువత స్వయం ఉపాధి పథకాలతో ఆర్థికంగా ఎదగాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథ్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని మక్తమాదారంలో అక్కారి శివ ఏర్పాటు చేసుకున్న స్వయం ఉపాధి పథకాన్ని దశరథ్ నాయక్ ఆదివారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ మంజులా చంద్రమౌళి, మాజీ సర్పంచ్ సులోచన సాయిలు, నాయకులు గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, మహేందర్, జలీల్, జంగయ్య, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

నరక ప్రాయం..
తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు

- రెండు హైవేలకు అనుసంధాన రహదారి
- రెండేళ్లుగా పడకేసిన విస్తరణ పనులు
- కంకర తేలి ధ్వంసం.. తరచూ ప్రమాదాలు
- పనులు పూర్తి చేయాలని మంత్రిని కలిసి వినతి



మరమ్మతులకు నోచుకోని తుమ్మలూరు రోడ్డు

మహేశ్వరం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): తుమ్మలూరు మీదుగా ఇటు మహేశ్వరం, అటు శ్రీశైలం-హైదరాబాద్ రహదారికి రోజూ వందలాది వాహనాలు వెళ్తుంటాయి. అయితే రోడ్డు విస్తరణ పనులు నత్తనడకన సాగుతుండడంతో రెండేళ్లుగా ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న వారు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ప్రభుత్వం 5కిలో మీటర్ల రోడ్డు విస్తరణకు రూ.14కోట్లు మంజూరు చేసింది. ప్రారంభంలో పనులను వేగంగానే చేసిన కాంట్రాక్టర్ ఇప్పుడు నిర్లక్ష్యం వహిస్తున్నారు. దీంతో తుమ్మలూరు, మహేశ్వరం ప్రాంత ప్రజలే కాకుండా శ్రీశైలం, బెంగళూరు రెండు జాతీయ రహదారులకు అనుసంధానంగా ఉన్న ఈ రోడ్డును వినియోగించే ప్రయాణికులు సైతం తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రోడ్డుపై ఉన్న కంకర రాళ్లు తగిలి వాహనాలు రిపేరుకొస్తున్నాయి. దుమ్ముతో జనం అవస్థ పడుతున్నారు. హైదరాబాద్-బెంగళూరు 44వ నంబరు హైవే నుంచి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపైకి చేరాలంటే తుమ్మలూరు-మహేశ్వరం రోడ్డు వాడకం తప్పదు. ఇంత ముఖ్యమైన ఈ రోడ్డు విస్తరణ పనులు పది నెలలుగా పడకేసినా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇదిలా ఉంటే తుమ్మలూరు రోడ్డు విస్తరణ పనులను వెంటనే ప్రారంభించి త్వరగా పూర్తిచేయించేలా పాలకులు అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. కొన్ని రోజుల క్రితం గ్రామ యువకులు రోడ్లు, భవనాల శాఖమంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, ఆర్‌అండ్‌బీ చీఫ్ ఇంజినీర్ మోహన్‌నాయక్‌లను కలిసి రోడ్డు సమస్యను త్వరగా పరిష్కరించాలని మొరపెట్టుకున్నారు. ఇదిలా ఉంటే ఈ రోడ్డు పనులను వెంటనే ప్రారంభించి పనులను త్వరగా పూర్తిచేయకుంటే ప్రజలతో హైదరాబాద్-శ్రీశైలం దిగ్బంధిస్తామని తుమ్మలూరు మాజీ ఉప సర్పంచ్ కె.శ్రీహరి హెచ్చరించారు.

సమన్వయ సమావేశం నిర్వహించాలి

- భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి



మాట్లాడుతున్న గుండ్ల రామతీర్థ

మేడ్చల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి మేడ్చల్ అసెంబ్లీ కన్వీనర్ గుండ్ల రామతీర్థ అన్నారు. ఆదివారం తూంకుంటలో భాగ్యనగర్ ఉత్సవ సమితి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. హిందువులు భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగల్లో ప్రధానమైనది వినాయక చవితి అన్నారు. ఈ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించుకునేందుకు రాష్ట్ర స్థాయిలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. అందులో భాగంగా మంత్రులు, అధికారులు హైదరాబాద్, రాచకొండ, సైబరాబాద్ పోలీసు కమిషనర్లు, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల కలెక్టర్లు భాగ్యనగర్ ఉత్సవ సమితి సభ్యులతో సమన్వయ సమావేశాలు నిర్వహించారన్నారు. కానీ మేడ్చల్ జిల్లాలో అందుకు భిన్నంగా అధికారుల తీరు ఉందన్నారు. మేడ్చల్ కలెక్టర్ ఇప్పటి వరకూ సమన్వయ సమావేశాన్ని నిర్వహించలేదన్నారు. ఘట్‌కేసర్ ముండల పరిధిలో నిమజ్జనం జరిగే ఎదులాబాద్ లక్ష్మీనారాయణ చెరువులో గతేడాది వేసిన విగ్రహాల అవశేషాలు ఇంకా అక్కడే పడి ఉన్నాయన్నారు. భక్తిశ్రద్ధలతో పూజించిన విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని సక్రమంగా నిర్వహించకుంటే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేసారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి గణపతి ఉత్సవాలపై భాగ్యనరగ్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించి, సమస్యలపై చర్చించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి కో-కన్వీనర్లు నూనెమూతల రవీందర్, పొలగొని రాజేశ్, కాంతం చిన్నప్ప, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలకు సమాయత్తం కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న జైపాల్‌యాదవ్

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయమే లక్ష్యంగా బీఆర్ఎస్ శ్రేణులు సమాయత్తం కావాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. కడ్తాలలో ఆదివారం పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని, ఎన్నికలను ఎదుర్కొనేందుకు స్థానిక నాయకులు సిద్ధంగా ఉండాలన్నారు. అందరు పనిచేసి కల్వకుర్తి నియోజకవర్గంలో అత్యధిక స్థానాల్లో పార్టీ అభ్యర్థులు గెలిచేలా కృషి చేయాలన్నారు. పంచాయతీలు, మండలాలు, మునిసిపాలిటీల్లో ప్రజాప్రతినిదులు లేక పాలన అస్తవ్యస్తమైందన్నారు. ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని సూచించారు. కాగా సోమవారం జైపాల్‌యాదవ్ సన్మదినాన్ని పురస్కరించుకొని కడ్తాల మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్, మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, పార్టీ జిల్లా, మండల నాయకులు శంకర్, లచ్చీరామ్‌నాయక్, చంద్రమౌళి, రమేశ్, కృష్ణయ్య, వీరయ్య, ప్రవీణ్‌గౌడ్, రామకృష్ణ, బిక్షపతి, పత్యనాయక్, జి.శ్రీనివాస్, వెంకటయ్యగౌడ్, బాబ, శ్రీకాంత్, నాగార్జున, చెన్నయ్య, యాదయ్య, సురేశ్, కుమార్ పాల్గొన్నారు.

స్కూళ్లకు చేరిన టెన్త్ మెమోలు

ఈ ఏడాది మార్కుల జాబితాల్లో మార్పులు

బషీరాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల మార్క్స్ మెమోలు పాఠశాలలకు చేరాయి. కాగా సెకండరీ స్కూల్ ఎడ్యుకేషన్ బోర్డు 'పది' మార్కుల జాబితాలో ఈ ఏడాది మార్పులు చేసింది. గతంలో ఉన్న గ్రేడింగ్ విధానాన్ని సవరించి సబ్జెక్టుల వారీగా మార్కులతో ఏప్రిల్‌లో ఫలితాలను విడుదల చేసింది. మార్కు మెమోలను బోర్డు అధికారులు స్పీడ్ పోస్టులో పంపడంతో మండలంలోని స్కూళ్లకు సర్టిఫికెట్లు వచ్చాయి. గతేడాది వరకు ఫలితాల్లో సబ్జెక్టు మార్కులతో పాటు గ్రేడ్ పాయింట్లు వేసేవారు. ఈ సారి సబ్జెక్టుల థియరీకి 80, ఇంటర్నల్‌కు 20 చొప్పున మార్కులు కేటాయించారు. సాధించిన మార్కులతో గ్రేడింగ్ పేర్కొన్నారు. చివరగా పాస్/ఫెయిల్ మాత్రమే రాశారు. మొత్తం ఎన్ని మార్కులొచ్చాయనేది సబ్జెక్టుల వారీగా కూడితే తప్ప తెలియని పరిస్థితి ఉండటం గమనార్హం.



పదో తరగతి మార్కుల మెమో

రక్తదానంపై అపోహలు వీడాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

వికారాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): అపోహలు వీడి ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. ఆదివారం వికారాబాద్‌లోని బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో చేపట్టిన మెగా రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రక్తదానం చేస్తే బలహీనమవుతామనే అపోహ చాలా మందిలో ఉంటుందన్నారు. అది వాస్తవం కాదని, రక్తదానం చేసినా, చేయకపోయినా మనిషిలో పాత రక్తకణాలు చనిపోవడం, కొత్తవి పుట్టడం సహజం అన్నారు. రక్తదానం అత్యవసర సమయాల్లో ఎన్నో ప్రాణాలను నిలబెడుతుందన్నారు. రక్తదానం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారి మధు అక్కయ్య, డాక్టర్ సబితాఆనంద్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు గోపాల్, అనంతరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్, విజయ్‌కుమార్, సుభాన్‌రెడ్డి పాల్గొన్నారు.

'ఓటుకు నోటు' డాక్యుమెంటరీ చిత్రీకరణ



డాక్యుమెంటరీ చిత్రీకరణలో పాల్గొన్న కళాకారులు

ఘట్‌కేసర్, ఆగస్టు24(ఆంధ్రజ్యోతి): 'ఓటును అమ్ముకోకండి-నమ్ముకోండి.' అని ప్రజలను చైతన్యపరిచేలా దర్శకుడు, రచయిత, నటుడు బుడితి కోటేశ్ డాక్యుమెంటరీని చిత్రీకరిస్తున్నాడు. ఆదివారం ఘట్‌కేసర్‌లోని బాలాజీనగర్ పరిసరాల్లో ఇందుకు సంబంధించి కళాకారులతో చిత్రీకరించారు. కోటేశ్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యంలో ఓటు విలువ, దాని ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకే ఈ షార్ట్ ఫిల్మ్‌ను రూపొందిస్తున్నట్లు చెప్పారు. వ్యక్తులు తమ ఓటును కరెన్సీ నోటుకో, బిర్యానీ పొట్లానికో అమ్ముకుంటే సమాజం ఐదేళ్ల అభివృద్ధికి దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఇలాంటి అనేక అంశాలపై అవగాహన కల్పించేందుకే తాను ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నట్టు తెలిపారు. దీనికి కెమెరామన్ అండ్ ఎడిటర్‌గా పొట్ట భానుచందర్ వ్యవహరిస్తున్నట్టు తెలిపారు.

పీఏసీఎస్‌లు రైతులకు దన్నుగా నిలవాలి



ఎమ్మెల్యే నారాయణరెడ్డిని సన్మానిస్తున్న ప్యాక్స్ చైర్మన్ వెంకటేశ్, డైరెక్టర్లు

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు రైతులకు వెన్నుదన్నుగా నిలవాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సహకార వ్యవస్థ బలోపేతానికి ప్రభుత్వం అనేక సంస్కరణలు చేపట్టిందని తెలిపారు. ప్యాక్స్ పాలకవర్గాల కాల పరిమితిని 6నెలలు పొడిగించడాన్ని హర్షిస్తూ కల్వకుర్తి ఎమ్మెల్యే నారాయణరెడ్డిని ఆమనగల్లు ప్యాక్స్ చైర్మన్ గంప వెంకటేశ్, డైరెక్టర్లు ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను కలిశారు. బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహతో కలిసి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. వారితో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పీఏసీఎస్‌లు రైతులకు సకాలంలో రుణాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సింగిల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు వీరయ్య, వెంకటయ్య, దోళ్యనాయక్, సేవ్య, జంగమ్మ, వికాస్, సీఈవో దేవేందర్, విండో సిబ్బంది అల్లాజి, పద్మాకర్, నాయకులు ఎల్లాగౌడ్, రమేశ్ పాల్గొన్నారు.

విద్యారంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం



పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): విద్య కోసం వెచ్చించే ప్రతీ రూపాయి ఖర్చు భవిష్యత్తు తరాలకు పెట్టుబడిగా భావించి కాంగ్రెస్ ప్రభుత్వం విద్యారంగానికి ప్రాధాన్యం ఇస్తోందని ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ శ్రీనివాస్ అన్నారు. విద్యాసంస్థల్లో మెరుగైన వసతులు కల్పించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. కడ్తాల మండలం రావిచెడ్‌లో రూ.12లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనాన్ని ఆదివారం నాయకులతో కలిసి వారు పరిశీలించారు. పనులను వేగవంతంగా పూర్తిచేసి ప్రారంభించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బిచ్యానాయక్, జనార్ధన్‌గౌడ్, రమేశ్, శ్రీశైలం, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్



మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): పెరిగిన ధరలకనుగుణంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు రూ.26వేల కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిషన్ డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మున్సిపల్ కార్మికులను శ్రమ దోపిడీకి గురి చేస్తున్నాయన్నారు. ఆమనగల్లు మున్సిపల్ కార్యాలయంలో ఆదివారం వర్కర్స్ సిబ్బంది యూనియన్ 3వ మహాసభలు వింజమూరి నర్సింహ అధ్యక్షతన నిర్వహించారు. సెప్టెంబరు 19, 20 తేదీల్లో తుర్కయంజాల్‌లో నిర్వహించే రాష్ట్ర 5వ మహా సభలకు సంబంధించి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.10లక్షలు, పెన్షన్ సౌకర్యం, ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబానికి రూ.50లక్షలు, ప్రభుత్వ పథకాలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శివశంకర్, వగ్గు రవి, హంసమ్మ, నర్సింహ, మైసమ్మ, యాదమ్మ పాల్గొన్నారు.

కాలనీకి నిలిచిన నీటి సరఫరా

ధారూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధి నాగసమందర్ 11వ వార్డు ఎస్సీ కాలనీలో తాగునీరు రాక ప్రజలు అవస్థ పడుతున్నారు. ఇంతకుముందు వారానికి ఒకసారి నల్లానీరు వదిలేవారని.. ప్రస్తుతం కాలనీకి మొత్తానికే తాగునీరు సరఫరా నిలిచిపోయిందని కాలనీ వాసులు చెప్పారు. గ్రామంలో 3 వాటర్ ట్యాంకులు ఉన్నా తమ కాలనీకి నీటి సరఫరా లేదని ఆదివారం వారు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై పంచాయతీ కార్యదర్శిని అడిగితే.. కొత్త బోరు వేస్తేనే మీ గల్లీకి తాగునీరు వస్తుందని చెబుతున్నారని వాపోయారు. నెల రోజులుగా కాలనీలోని 25ఇళ్లకు నీటి సరఫరా నిలిచి ఇతర కాలనీలకు వెళ్లి తాగునీటిని తెచ్చుకుంటున్నామని ప్రజలు చెప్పారు. అధికారులు స్పందించి తమ కాలనీలో నీటి సమస్య తీర్చాలని కోరారు.

ప్రతిష్ఠాపనకు గణనాథులు సిద్ధం


మొయినాబాద్ మండలం హిమాయత్ నగర్‌లో గణనాథుడిని మండపానికి తరలిస్తున్న నిర్వాహకులు


షాద్‌నగర్ అర్బన్ : మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేస్తున్న నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి

- విక్రయ కేంద్రాల నుంచి మండపాలకు తరలింపు
- ఏర్పాట్లలో ఉత్సవ కమిటీ సభ్యులు నిమగ్నం

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుడి ఉత్సవాల కోసం గణనాథులు మండపాలకు చేరుతున్నారు. షాద్‌నగర్ పట్టణంలో ప్రతిష్ఠించే భారీ విగ్రహాలను హైదరాబాద్‌లోని దూల్‌పేట నుంచి భక్తులు తీసుకువస్తున్నారు. ఖర్చుకు ఏమాత్రం వెనుకడుగు వేయకుండా లక్షల రూపాయలతో విగ్రహాలను కొనుగోలు చేస్తున్నారు. స్థానిక కాలేజ్ రోడ్డులో భగత్ యూత్ గణేష్ మండపంలో రూ.2లక్షల 80 వేలతో కొనుగోలు చేసిన భారీ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. పలు యువజన సంఘాలు పోటాపోటీగా భారీ సెట్టింగ్‌లను వేయించి, భారీ విగ్రహాలను నెలకొల్పబోతున్నారు. ఉత్సవాల కోసం స్థానిక వినాయక గంజ్‌లో వేలాది గణేశ్ విగ్రహాలను విక్రయిస్తున్నారు. గతేడాదితో పోలిస్తే విగ్రహాల కొనుగోళ్లు పెరిగాయని, ధరలు కూడా కాస్త పెరిగాయని విక్రయదారులు తెలిపారు. కాగా, ఇప్పటికే షాద్‌నగర్‌లో 200 వినాయక మండపాల ఏర్పాటుకు పోలీసులు అనుమతి ఇచ్చినట్లు సమాచారం.


ఆదిభట్ల : ఉప్పరిగూడ గణేశ్ మండపం నిర్వాహకులకు రథం సమకూర్చిన రాంరెడ్డి

ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించాలి

వినాయక ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, సత్యశ్రీ ఫౌండేషన్ చైర్మన్ నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి పిలుపునిచ్చారు. షాద్‌నగర్ వివేకానంద డిగ్రీ కళాశాలలో ఆదివారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమలను పంపిణీ చేశారు. వివేకానంద విద్యాసంస్థల డైరెక్టర్లు వి.విజయ్ కుమార్, సత్యనారాయణ, కరుణాకర్‌రెడ్డి, ఆర్యవైశ్య సంఘాల నాయకులు ఎంసాని శ్రీనివాస్, ప్రకాష్, రవి కుమార్, నాయకులు వంశీకృష్ణ, పేట అశోక్, ఎం. మురళి, గజ్జల ప్రవీణ్, మహేష్ తదితరులున్నారు.

వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆదిభట్ల : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని బీఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి అన్నారు. ఆదివారం ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని పోచారం, ఉప్పరిగూడ, దండుమైలారం గ్రామాల గణేశ్ మండపం నిర్వాహకులకు ఊరేగింపు రథాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ 27న వినాయక చవితి పురస్కరించుకొని ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, ప్రశాంత వాతావరణంలో వేడుకలు జరుపుకోవాలని ఆయన యువకులకు సూచించారు. నర్సింహరెడ్డి, భగీరథ, సామల శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, మంగ ఐలేష్, శేఖర్, గోపాల్, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


షాద్‌నగర్‌లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు

ఎకో ఫ్రెండ్లీ.. పర్యావరణ హితం..

కేశంపేట, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలో మట్టి వినాయకుల ఏర్పాటుకు పర్యావరణ ప్రేమికులు, యువజన సంఘాలు చొరవతీసుకుంటున్నారు. వినాయకచవితిని పురస్కరించుకుని మండల కేంద్రంతో పాటు గ్రామాలల్లో ఎకో ఫ్రెండ్లీ వినాయకులను ఏర్పాటు చేసి పూజలు చేస్తున్నారు. కేశంపేటలో అధ్యాపకుడు నక్క చంద్రశేఖర్, నక్క గోపాల్ యాదవ్‌లు 15 సంవత్సరాల క్రితం అభినవ భారత్ అనే యువజన సంఘాన్ని స్థాపించి మొదటిసారిగా 8 అడుగుల ఎత్తు ఉన్న మట్టి వినాయకుడిని ఏర్పాటుచేసి పూజలు చేశారు. ఇలా పర్యావరణహిత వినాయకుల ఏర్పాటు ఇక్కడ ప్రారంభమైంది. వారిని ఆదర్శంగా తీసుకున్న నవయుగ యూత్ 8 సంవత్సరాలుగా మట్టి వినాయకులను ఏర్పాటు చేసి కొలుస్తున్నారు. పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, పోమాల్ పల్లి, కొండారెడ్డి పల్లి, కాకునూర్, తొమ్మిదిరేకుల, లింగధన, లేమామిడి, కొత్తపేట, సంతాపూర్, సంగెం, భైర్కాన్‌పల్లి, తులవానిగడ్డ, అల్వాల గ్రామాలలో యువజన సంఘాల సభ్యులు ఎకో ఫ్రెండ్లీ వినాయకుల ఏర్పాటుకు చొరవ చూపుతున్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్, రంగులతో తయారు చేసే వినాయకులను చెరువులలో నిమజ్జనం చేస్తే నీరు కలుషిత అవుతుందని, పర్యావరణ పరిరక్షణలో తన భాగసామ్యం ఉండాలని ఆకాంక్షిస్తున్న పర్యావరణ ప్రేమికుడు కేశంపేట గ్రామానికి చెందిన మల్హాంకర్ శివాజీ. గత 6 ఏళ్లుగా 108 మట్టి వినాయకులను భక్తులకు వినాయక చవితి ముందు రోజు వితరణ చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో 108 వినాయకులను కొనుగోలు చేసి తీసుకవచ్చిన గణపతులను భక్తులకు అందజేస్తుంటారు.


భక్తులకు విగ్రహాలను పంపిణీ చేస్తున్న శివాజీ(ఫైల్)

క్రైం కార్నర్

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి మృతి

చౌదరిగూడ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ట్రాక్టర్ ఢీకొట్టడంతో వ్యక్తి మృతిచెందిన ఘటన జిల్లేడు చౌదరిగూడ మండలంలో ఆదివారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కొందుర్గు మండల పరిధిలోని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన శంకరయ్య గౌడ్(40) కాస్లాబాద్ శివారులోని వ్యవసాయ పొలంలో పనులు ముగించుకొని బైక్‌పై ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో కాస్లాబాద్ గ్రామ శివారులో వాగు వద్ద ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ బైక్‌ను ఢీకొట్టింది. దాంతో శంకరయ్య గౌడ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయన భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విజయ్ తెలిపారు.

ఆత్మరక్షణకు కరాటే అవసరం


శంషాబాద్ రూరల్ : విద్యార్థులకు బెల్టులు, సర్టిఫికెట్లు అందిస్తున్న సినీనటుడు ఇంద్రసేన, నీరటి రాజు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): అత్మ రక్షణకు కరాటే ఎంతో అవసరమని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నీరటి రాజు అన్నారు. మండల పరిధిలోని నర్ఖూడ అమ్మపల్లి ఆవరణలో నిర్వహించిన అంతర్జాతీయ వారియర్స్ కరాటే చాంపియన్‌షిప్ శిక్షణ శిబిరం ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ చూపారు. యాదగిరి మాస్టర్ ఆధ్వర్యంలో జరిగిన శిక్షణ శిబిరంలో విద్యార్థులకు రాజు బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నేటి సమాజంతో కరాటే నేర్చుకోవడం తప్పనిసరి అని, ముఖ్యంగా ప్రతీ ఆడబిడ్డ నేర్చుకోవాలని సూచించారు. సినీనటుడు ఇంద్రసేన, కొండారెడ్డిపల్లి మాజీ సర్పంచ్ బాలేష్, మల్కారం పీఎసీఎస్ చైర్మన్ బుర్కుంట సతీష్, శ్రీనివాస్, శివాజీ, కూరగాయల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కుంగ్‌ఫూలో విద్యార్థుల ప్రతిభ

కొందుర్గు : హైదరాబాద్ యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్ స్టేడియంలో బ్రూస్లీ జెట్ జిత్కోండో ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటర్‌నేషనల్ ఆల్‌స్టైల్ కుంగ్‌ఫూ ఓపెన్ మార్షల్ ఆర్ట్స్ టోర్నమెంట్‌లో భాగంగా కొందుర్గుకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాల్లో ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ రమేష్ పేర్కొన్నారు. గోల్డ్‌మెడల్స్ సాధించిన అనసూయ, హర్షవర్ధన్‌గౌడ్, నహీద్, సాయితేజలను పలువురు అభినందించారు.


కొందుర్గు : కుంగ్‌ఫూలో ప్రతిభ కనబర్చిన కొందుర్గు విద్యార్థులు

కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలు


కాంగ్రెస్‌లో చేరిన బీజేపీ కార్యకర్తలతో లక్ష్మీపతిగౌడ్

యాచారం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లవెల్లికి చెందిన 20 మంది బీజేపీ కార్యకర్తలు ఆదివారం గ్రామ మాజీ ఎంపీటీసీ ఈదులకంటి లక్ష్మీపతిగౌడ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఫరాన, శ్రీకాంత్‌తో పాటు 20మంది బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారని లక్ష్మీపతిగౌడ్ చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల నాటికి పార్టీని బలోపేతం చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీ నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని అన్నారు.

కమీషన్.. పరేషాన్

(ఐదో పేజీ తరువాయి)

125 దుకాణాలు ఉన్నాయి. చేవెళ్ల మండలంలో 42, షాబాద్‌లో 37, మొయినాబాద్ మండలంలో 19, శంకర్‌పల్లి మండలంలో 27 దుకాణాలు ఉన్నాయి. ప్రతీనెల 1వ తేదీ నుంచి 15 వరకు రేషన్ లబ్ధిదారులకు రేషన్ అందించాల్సి ఉంది. ప్రభుత్వం క్వింటాకు రూ. 140 కమీషన్ ఇస్తుంది. అందులో హమాలీలకు క్వింటాకు రూ.17 చెల్లించాల్సి ఉంటుంది. 15రోజుల పాటు రేషన్ షాపులో పని చేసిన వర్కర్‌కు రోజుకు రూ.500 చెల్లించాలి. రేషన్ షాపు కిరాయి నెలకు రూ.2 వేలు నుంచి రూ.3 వేల వరకు అవుతుంది. అయితే గత ఐదు నెలలుగా కమీషన్ రాకపోవడంతో ఇల్లు గడవటం కష్టంగా మారిందని పలువురు రేషన్ డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పాత ఇళ్లలోనే రేషన్ దుకాణాలు

రేషన్ దుకాణాలకు ఇళ్లు అద్దెకు ఇచ్చేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు. రేషన్ స్టాక్ భద్రపరిచితే పురుగులు, పందికొక్కులు, ఎలుకల బెడద ఉంటుందని భయపడుతున్నారు. దీంతో పురాతన ఇళ్లలోనే షాపులు నిర్వహించాల్సి వస్తుంది. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని మూడునెలల రేషన్ ఇవ్వాలని ప్రభుత్వ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ మేరకు డీలర్లు మూడు నెలల స్టాక్ ఐదు దఫాలుగా తెచ్చి లబ్ధిదారులకు అందించారు. స్టాక్ ఉన్న కాలంలో 15 రోజుల పాటు ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ షాపు తెరిచి ఉంచి లబ్ధిదారులకు బియ్యం పంపిణీ చేశామని గుర్తు చేస్తున్నారు. అయితే, రేషన్ సరుకులు తీసుకునే సమయంలో మూడు దఫాలు వేలిముద్రలు వేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇంత కష్టపడినా కమీషన్ సకాలంలో చెల్లించకపోవడం దారుణమన్నారు. ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి కమీషన్ డబ్బులు తక్షణమే విడుదల చేయాలని డీలర్లు కోరుతున్నారు.

జానపద కళలను పరిరక్షించుకోవాలి


కళాకారులతో పాపిశెట్టి రాము తదితరులు

ఆమనగల్లు, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): జానపద కళలను, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని సంఘ సేవకుడు పాపిశెట్టి రాము అన్నారు. జానపద కళాకారులకు ప్రతీ ఒక్కరూ తోడ్పాటునందించి భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వ భాషా, సాంస్కృతిక శాఖ సహకారంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ జానపద దినోత్సవ సంబరాలను పట్టణంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. రాము ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జానపద కళాకారులను సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో శృతిలయ కల్చర్ అకాడమీ చైర్మన్ చిత్తరంజన్‌దాస్, స్థానిక నాయకుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి ఘన నివాళి


శంషాబాద్ : మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు


షాద్‌నగర్ అర్బన్ : సురవరం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

శంషాబాద్/షాబాద్/షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ జాతీయ మాజీ కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి మృతదేహానికి శంషాబాద్‌కు చెందిన సీపీఐ నాయకులు ఆదివారం నివాళులర్పించారు. జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, పుస్తకాల నర్సింగ్‌రావు, ఆర్.యాదగిరి, నర్రా గిరి, వెంకటేష్‌తో పాటు పలువురు కార్యకర్తలు నివాళులర్పించారు. మాజీ సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటు అని సీపీఐ షాబాద్ మండల కార్యదర్శి పాలమాకుల శ్రీశైలం అన్నారు. ఆదివారం నగరంలో ఆయన పార్థివదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. షాబాద్ మండల మాజీ కార్యదర్శి జంగయ్య, నాయకులు ఆనందం, వెంకటేష్ తదితరులు ఉన్నారు. షాద్‌నగర్‌లో సుధాకర్‌రెడ్డికి నాయకులు ఘన నివాళులర్పించారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు ఎం.శ్రీను ఆధ్వర్యంలో షాద్‌నగర్ చౌరస్తాలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి వామపక్ష ఉద్యమాలలో పాల్గొన్న సురవరం సుధాకర్‌రెడ్డి పేదల పక్షాన నిలిచి పోరాటాలు చేశారని అన్నారు. పాలమూరు జిల్లాలో పుట్టి పల్లె నుంచి ఢిల్లీ వరకు పార్టీని బలోపేతం చేసిన గొప్పనాయకుడని కొనియాడారు. సురవరం సుధాకర్‌రెడ్డి అడుగుజాడల్లో కార్యకర్తలు ముందుకు సాగాలని కోరారు. నాయకులు టి. నర్సింహ్మారెడ్డి, బి. జంగయ్య, జి. గంజయ్య, గోవింద్‌నాయక్, లింగంనాయక్, రమేష్, రవి, నర్సింహ, ఆకాశ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.


షాబాద్ : మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న శ్రీశైలం, తదితరులు

మున్సిపల్ కార్మిక యూనియన్ కార్యవర్గం


అధ్యక్ష కార్యదర్శులు వగ్గు రవి, నర్సింహ

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు మున్సిపల్ కార్మిక యూనియన్‌ను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వగ్గు రవి, కార్యదర్శిగా వింజమూరి నర్సింహ, కోశాధికారిగా మీసాల గోపాల్, ఉపాధ్యక్షురాలిగా హంసమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రశాంత్, సహాయ కార్యదర్శిగా గణేశ్, సంయుక్త కార్యదర్శిగా విజయ్‌కుమార్, సభ్యులుగా కొమ్ము యాదమ్మ, జంతుక పద్మ, సుగుణమ్మ, వి.సుధాకర్, చిట్టిబాబు, రాములు, శివ, శ్రీనులు ఎన్నికయ్యారు. నూతన కమిటీని నాయకులు సత్కరించి అభినందించారు.

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

శంషాబాద్ రూరల్/శంషాబాద్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండల కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా నేడు(సోమవారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈలు అఫ్సర్ బాషా, షేక్‌బాషాలు పేర్కొన్నారు. ఉదయం 11:30 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్జీఐ పీఎస్, సిద్ధాంతి, హుడా కాలనీ, ఆర్‌బీనగర్, రాళ్లగూడ, ఓఎంజై భవానీ, ఎయిర్‌పోర్టు కాలనీ, రాయల్‌విల్లా, ఫోర్ట్‌గ్రౌండ్, కొత్వాల్‌గూడ, సిద్దులగుట్ట కమాన్, మసీదు గడ్డ ప్రాంతాల్లో సరఫరా ఉండదన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ఆమనగల్లు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలోని 3వ వార్డు నుచ్చుగుట్ట తండాకు చెందిన దోళి మృతిచెందింది. మృతురాలి కుటుంబాన్ని బీఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు పత్యానాయక్ ఆదివారం పరామర్శించారు. పత్యానాయక్ ఫౌండేషన్ ద్వారా సమకూర్చిన 50 కేజీల బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు.

సంకల్పంతోనే సామాజిక సేవ



స్కూటీ అందిస్తున్న బండారి రమేష్, మహేంద్రకుమార్‌రెడ్డి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): సంకల్పం ఉంటే సామాజిక సేవచేయడం ప్రతీఒక్కరికి సాధ్యమేనని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ డాక్టర్ మహేంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. రిటైర్డు ఎంపీడీవో లయన్ దండు శరత్‌చంద్రబాబు జన్మదినాన్ని పురష్కరించుకుని లయన్స్ క్లబ్ ఆఫ్ షాద్‌నగర్ సంకల్ప్ అధ్యక్షుడు రవికుమార్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. దివ్యాంగుడికి ట్రై స్కూటీని, ముగ్గురు పేద విద్యార్థులకు సైకిళ్లను, ఓ పేద మహిళకు కుట్టుమిషన్‌ను అందజేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్స్ పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణ కోసం ఈశ్వర్‌కాలనీలో మొక్కలను నాటి, వినాయక చవితి ఉత్సవాల కోసం 100 మట్టి వినాయకుల ప్రతిమలను పంపిణీ చేశారు. మహేంద్రకుమార్‌రెడ్డితో పాటు వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ బండారి రమేష్‌లు హాజరై సేవా కార్యక్రమాల నిర్వహణ పట్ల అభినందించారు. షాద్‌నగర్ గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ మదన్‌మోహన్‌రెడ్డి, హైదరాబాద్ రెడ్‌క్రాస్ చైర్మన్ భీమ్‌రెడ్డి, లయన్ శరత్‌చంద్రబాబు, లయన్ తాళ్ళ అంజయ్య, భయంకర్‌రాజు, రామకృష్ణారెడ్డి, ఎంవీఎస్ రంగయ్య, ఎర్ర శ్రీనివాస్, సాయికృష్ణ, రాజేష్, సతీష్, నర్సింహారెడ్డి, వెంకట్‌నాయక్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ నుంచి బాడీబిల్డింగ్ ప్రపంచ చాంపియన్లు రావాలి

(ఐదో పేజీ తరువాయి)

నిరంతర క్రమశిక్షణ ఉంటే అద్భుతమైన శరీర ఆకృతిని సాధించవచ్చునని తెలిపారు. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు బాడీబిల్డింగ్‌ను అధికారికంగా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. క్రీడాకారులకు స్కాలర్‌షిప్‌ను అందిస్తే ఒలింపిక్స్‌లో గుర్తింపు పొందిన బాడీబిల్డింగ్, పవర్ లిఫ్టింగ్ క్రీడల్లో రాణిస్తారని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఈ ఏడాది జరిగిన 70కి పైగా ఐసీఎన్ పోటీలలో ఇది అతి పెద్దదిగా నిలిచిందన్నారు. ఈ ఈవెంట్‌కు వెల్వర్త్ ప్రజెంటింగ్ పార్ట్‌నర్‌గా వ్యవహరించిందన్నారు. దేశ విదేశాల నుంచి వచ్చిన 400 మంది ప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వడం ప్రశంసనీయమన్నారు. నిర్వాహకుడు ఆదిత్య మాట్లాడుతూ ఒక స్పోర్ట్స్ న్యూట్రీషియన్ బ్రాండ్‌గా భారతదేశంలో సహజ బాడీ బిల్డింగ్ ఒక సమగ్ర ఎకోసిస్టమ్ అని కొనియాడారు. పోటీల్లో పాల్గొనే అథ్లెట్ల సంఖ్య ప్రతీ ఏడాది పెరుగుతూ వస్తుందని అన్నారు. బాడీ బిల్డింగ్‌లో భారత్‌కు గుర్తింపు తేవడమే లక్ష్యమన్నారు. వివిధ దేశాల క్రీడాకారులు నిర్వాహకులు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆదిభట్ల/కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్న కోడూరి బాషా కుటుంబానికి దాయాదులు అండగా నిలిచారు. దగ్గరి బంధువులు, తోబుట్టువులు ఆయన భార్యకు ఆదివారం రూ.93 వేల ఆర్థికసాయం అందజేశారు. వారికి కాంగ్రెస్ పార్టీ ఇబ్రహీంపట్నం వర్కింగ్ ప్రెసిడెంట్ రమేష్ కృతజ్ఞతలు తెలిపారు. కడ్తాల్ మండలం రావిచెడ్‌కు చెందిన కృష్ణయ్య మృతిచెందాడు. మృతదేహాన్ని డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ శ్రీనివాస్‌లు సందర్శించి నివాళులర్పించారు. రూ.5వేల ఆర్థికసాయం బాధిత కుటుంబానికి అందజేశారు.

మైసమ్మకు పూజలు


పూజల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

తలకొండపల్లి, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండలం పరిధిలోని వెల్జాల సమీపంలోని రామాజీపల్లి మైసమ్మ బోనాల వేడుకలను గ్రామస్తులు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో ఆలయాన్ని పచ్చటి తోరణాలతో శోభాయమానంగా అలంకరించారు. మహిళలు పట్టువస్త్రాలు ధరించి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్‌లు పూజలు చేశారు. మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాస్ యాదవ్, జిల్లా, మండల నాయకులు డోకూరు ప్రభాకర్‌రెడ్డి, కాసు శ్రీనివాస్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ముజుబుర్ రహెమాన్, వెంకటయ్య, శ్రీనివాస మూర్తి, కుమార్, శరత్‌చంద్ర, అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కురుమలు అన్నిరంగాల్లో రాణించాలి

కందుకూరు, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): కురుమలు, రాజకీయంగా, ఆర్థికంగా, వ్యాపారపరంగా రాణించాలని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు అచ్చన పాండు కురుమ, జిల్లా నాయకులు ఎగ్గిడి సత్తయ్య, యూత్ కమిటీ అధ్యక్షుడు ఎగ్గిడి జగదీశ్ కురుమలు కోరారు. ఆదివారం లేమూరులో ఏర్పాటుచేసిన కురుమ సంఘం గ్రామస్థాయి ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. గ్రామ కురుమ సంఘం కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆర్.రవీందర్ కురుమ, ప్రధాన కార్యదర్శిగా కడారి మహేందర్, యూత్ అధ్యక్షుడిగా పల్లె శ్రీధర్, ప్రధాన కార్యదర్శిగా చిట్టి రాజేందర్‌లను ఎన్నుకున్నారు.

దైవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలి

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): దైవ, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో ప్రతీఒక్కరు పాలు పంచుకోవాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యనాయక్ అన్నారు. కానుగుబావి తండాలో నిర్మిస్తున్న తుల్జాభవాని మాత ఆలయ నిర్మాణానికి వెంకటేశ్ రూ.1,25,000, మోహన్‌రావు రూ.25 వేలు, రాజేందర్‌రెడ్డి రూ.11 వేలు విరాళం అందజేశారు.

అభివృద్ధి కార్యక్రమాలకు నేడు శంకుస్థాపన

కడ్తాల్, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గోవిందాయిపల్లితండా, మక్తమాదారం, గోవిందాయిపల్లి గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్ తెలిపారు. సోమవారం మక్తమాదారం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించే గ్రామ పంచాయతీ భవనం, గోవిందాయిపల్లి తండాలో రూ.12లక్షలతో నిర్మించే అంగన్‌వాడీ భవనం, గోవిందాయిపల్లిలో రూ.20 లక్షలతో నిర్మించే పంచాయతీ భవనాలకు శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు బీచ్యనాయక్ పేర్కొన్నారు.

వార్డుల్లో సీసీ రోడ్లు వేయండి

యాచారం, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): చింతపట్లలోని 5, 6వ వార్డుల్లో భూగర్భడ్రైనేజీ నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు వేయించాలని సీపీఎం నాయకులు జంగయ్య, వెంకటయ్యలు ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. గతంలో నిధులు విడుదల చేసి పనులు చేయలేకపోయారని, నిధులు విడుదలైనా పనులు ఎందుకు చేయడం లేదని ప్రశ్నించారు.

యువత మార్గదర్శకంగా ఉండాలి


లోగో ఆవిష్కరణలో నాయకులు

షాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): యువత అనుసరించే మార్గాలు పిల్లలకు మార్గదర్శకంగా ఉండాలని మాజీ జడ్పీటీసీ జడల రాజేందర్‌గౌడ్ అన్నారు. షాబాద్‌లో జైభీమ్ యువజన సంఘం లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ఆదివారం ఆయన పాల్గొన్నారు. యువత చెడుదారుల్లో పోకుండా, ఆశయ సాధన దిశగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జైభీమ్ యువజన సంఘం నూతన అధ్యక్షుడిగా విజయ్‌కుమార్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో బీసీ సేనా జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ, మాజీ ఎంపీటీసీ అశోక్, బీజేపీ నాయకులు రాము, కమిటీ సభ్యులు తొంట వెంకటయ్య కృష్ణ, రాములు, ప్రదీప్, ప్రవీణ్, అనిల్, రత్నం, గోపి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.